## వైభవంగా రేణుకాఎల్లమ్మ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మరికల్, డిసెంబర్ 5 : మండలంలోని తీలేరు గ్రామంలో వెలసిన రేణుకా ఎల్లమ్మ దేవి ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేసి, జల్దిబిందోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకొ ని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతమ్మ, ఎంపీటీసీ సునీత, ఆలయ కమిటీ సభ్యులు కొండప్ప, రాంచంద్రయ్య, నాయకులు శివరాములు, తిమ్మారెడ్డి, బజారప్ప పాల్గొన్నారు.

## ఘనంగా తాయమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాగనూర్ డిసెంబర్ 5: మండలంలోని అమ్మపల్లిలో మంగళవారం గ్రామ దేవత తాయమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎస్సై మల్లేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మకరతోరణం బహూకరణ

గోపాల్‌పేట, డిసెంబర్ 5 : మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాసాచారి అనురాధ దంపతులు మంగళవారం బుద్ధారం గండి ఆంజనేయస్వామికి రూ. 70వేల విలువగల మకరతోరణం, కవచం బహూకరించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామేశ్వరశర్మ, క్లర్క్ నగేశ్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు మల్లికార్జున్, సాంబయ్య, పూజారులు శ్రీనివాసులు, పాండురంగస్వామి పాల్గొన్నారు.

## ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదాం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మరికల్, డిసెంబర్ 5: శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎస్.రాజేందర్ రెడ్డి ఓటమి చెందడంతో అధైర్యపడొద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకు పోదామని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గొల్ల రాజేశ్‌యాదవ్ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఈశ్వరాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేట ఎమ్మెల్యేగా గెలుపొందిన పర్ణిక రెడ్డిని అభినందించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం ఎంతో కృషి చేసినా ప్రజలు మార్పుకోరుకోవడం వల్లే ఎస్.ఆర్.రెడ్డి ఓటమి చెందాడన్నారు. మరికల్ మండలాన్ని ఎస్.ఆర్.రెడ్డి ఎంతో అభివృద్ధి చెందించిన ప్రస్తుత ఎమ్మెల్యే మరింత అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధికి బీఆర్‌ఎస్ నాయకులు సహకరిస్తారని, అభివృద్ధిని విస్మరిస్తే నిలదీస్తామన్నారు. సమావేశంలో ఎంపీటీసీ గోపాల్, బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా ఇన్‌చార్జి గూప సర్సింహులు, యూత్ నాయకులు కమల్, యువరాజ్‌గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రసవాల సంఖ్య పెంచాలి

- పేట డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి



ఏఎన్‌ఎంలకు బయోమెట్రిక్ డివైస్‌లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

ఊట్కూర్, డిసెంబర్ 5: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని నారాయణపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆ మె ఊట్కూర్ ప్రభుత్వ దవాఖానను సందర్శించి రికార్డులు, స్టోర్‌రూంను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. మండలంలోని నాలుగు ఉపకేంద్రాలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ బయోమెట్రిక్ డివైస్‌లను ఏఎన్‌ఎంలకు పంపిణీ చేశారు. అనంతరం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు హబీబ్, భవాని, ఎంపీహెచ్‌ఈవో విజయకుమార్, సూపర్‌వైజర్ మణిమాల పాల్గొన్నారు.

### సాధారణ కాన్పులు చేయాలి

- వనపర్తి డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్

వనపర్తి, డిసెంబర్ 5: జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల్లో వంద శాతం సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రైవేట్ దవాఖానల యాజమాన్యం, వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవం కోసం దవాఖానలకు వచ్చే గర్భిణు లకు సిజేరియన్ తగ్గించాలన్నారు. ప్రతి గర్భిణికి ఆరోగ్య పరిరక్షణ కోసం యోగా శిక్షణ, మెడిటేషన్, సహజ సిద్ధమైన ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు జింక్ ఫుడ్‌కు దూరంగా ఉండేలా, ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వివరించాలన్నారు. ప్రతి రోగిని ఆత్మీయంగా పలకరించి వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, ప్రైవేట్ దవాఖానల వైద్యులు మోహన్, రాఘవేంద్రరెడ్డి, సిద్ధార్థ, మాస్‌మీడియా అధికారి చంద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మధు తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో వంద శాతం ఫలితాలు సాధించాలి

- వనపర్తి జిల్లా విద్యాశాఖాధికారి నరహరి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో నరహరి

ఆత్మకూర్, డిసెంబర్ 5: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి నరహరి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలన్నారు. విద్యా క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తిచేసి పదో తరగతి విద్యార్థులకు రివిజన్ నిర్వహించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పది పాయింట్లు సాధించే లక్ష్యంగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అర్థమయ్యేలా బోధించాలి

అమరచింత, డిసెంబర్ 5: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని వనపర్తి జిల్లా విద్యాశాఖాధికారి నరహరి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలర పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బలరాముడు అధ్యక్షతన నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాన్ని మండల విద్యాశాఖాధికారి భాస్కర్‌సింగ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో విద్యాశాఖ సూచించిన ఆరు అంశాలతో విద్యార్థులకు బోధించాలన్నారు. అనంతరం డీఈవో పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు, మెను ప్రకారం భోజనం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు డీఈవో, ఎంఈవోను సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు హనుమంతు, రాకేశ్, రమేశ్, రాము, సీఆర్పీ స్వామి పాల్గొన్నారు.

### సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి

నారాయణపేట, డిసెంబర్ 5: టెక్ టీం ఆపరేటర్లు, స్టేషన్ రైటర్లకు పోలీస్ శాఖ ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలని సీపీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వర్తించే టెక్ టీం ఆపరేటర్లు, స్టేషన్ రైటర్లకు వీసీ ద్వారా ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో వర్టికల్ అధికారులకు సహకరిస్తూ అవసరమైన సమయంలో ఆప్స్ నిర్వహణ విషయంలో శిక్షణ ఇవ్వాలన్నారు. సాంకేతిక సమస్యలను తొలి దశలోనే గుర్తించి పరిష్కరించాలని, స్టేషన్‌కు సంబంధించిన నేర సమాచారం ఎప్పటికప్పుడు సీసీటీఎన్‌ఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఐటీ కోర్ టీం సహాయంతో విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నారాయణపేట, డిసెంబర్ 5: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ తిరుపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నెంబర్ ప్లేటు లేని వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనానికి నెంబర్ ప్లేట్లు వేయించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ దేవేందర్, మధు పాల్గొన్నారు.

### ఘనంగా కార్తీక మాసోత్సవాలు

పెబ్బేరు, డిసెంబర్ 5: జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని రంగాపురం కృష్ణానది పుష్కరఘాట్ వద్ద ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్చకులు కుటుంబ సమేతంగా హాజరై సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు పీ.వీ.లక్ష్మీకాంతాచార్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

### మనిషి మనుగడ మట్టిలోనే..

పెద్దమందడి, డిసెంబర్ 5: మనిషి మనుగడ మట్టిలోనే అని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సైదయ్య అన్నారు. మంగళవారం మోజర్ల ఉద్యాన కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరో గ్యకరమైన నేలలే భవిష్యత్ తరాలకు జీవనాధారమని, నేల ఆరోగ్య సంరక్షణ ప్రజలందరి బాధ్యతఅన్నారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు బేబిరాణి, విద్య, పూర్ణిమ, శ్రీనివాస్, చంద్రశేఖర్, గౌతమి, భాగ్యశాలి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

వనపర్తి టౌన్, డిసెంబర్ 5: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఫుట్‌బాల్ అండర్-14 బాలికల జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలికెస్టయ్య క్రీడా మైదానంలో క్రీడాకారుల ఎంపిక ఉం టుందన్నారు. నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన బాలికలు ఒరిజినల్ ధ్రువపత్రాలు, బోనఫైడ్, ఆధార్ జిరాక్స్‌తో ఉదయం 9.00 గంటల లోపు హాజరుకావాలన్నారు. వివరాలకు ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు పీఈటీ తిరుపతయ్య 9490975431, రాజేందర్ 9550096010 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వనపర్తి టౌన్, డిసెంబర్ 5: జిల్లా కేంద్రం లోని పీజీ కళాశాలలో వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, బాటనీ, కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, జువాలజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం అర్హత పరీక్ష క్వాలిఫై అయిన వారు, కానివారు, రాయని సక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక కాపీ జిరాక్స్ సెట్‌తో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం

వనపర్తి టౌన్, డిసెంబర్ 5: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. అతి తక్కువ ఫీజుతో కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని, 8 వారాల పాటు ప్రోగ్రాంమింగ్ సీ, బేసిక్ ఆటోక్యాడ్, కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, 12 వారాల పాటు సర్వేయింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. 10వ తరగతి, సమానమైన కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని, ఆసక్తిగలవారు కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఉత్తమ రైతుకు సన్మానం

నారాయణపేట, డిసెంబర్ 5: హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కోరమండల్ గ్రూప్, లిబర్టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మట్టి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తెలంగాణలోని 10 మం ది ఉత్తమ రైతులను ఎంపిక చేశారు. అందులో నారాయణపేట పట్టణానికి చెందిన రైతు గట్టు అనిల్ ఎంపిక కాగా ఆయనను కోరమండల్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ సుబ్బారెడ్డి, ఉద్యానవన విశ్వవిద్యాలయ వైస్ చైర్మన్ నీరజా ప్రభాకర్, ప్రసాద్ సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

## కారు టైరు కింద పడి చిన్నారి మృతి

కృష్ణ, డిసెంబర్ 5 : కారుటైరు కిందపడి చిన్నారి మృతి చెందిన ఘటన మండలంలోని హిందూపూర్ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన శివాజీసుకుదేవ్ కుటుంబ సభ్యులతో కలిసి హిందూపూర్ గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఎన్ ఇటుకబట్టీలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. కాగా బట్టి యజమాని కారును డ్రైవర్ రహమాన్ రివర్స్ తీస్తుండగా.. చిన్నారి పల్లవి (18 నెలలు) పాకుతూవెళ్లి ప్రమాదవశాత్తు కారు టైరు కింద పడి మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.

### అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 5: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఉపారాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలిమెట్టులో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించి వారిలోని అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాన్ని రాష్ట్ర పరిశీలకులు ప్రకాశ్, గాయత్రి పరి శీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.